క్లుప్తంగా

లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు



లక్ష్మీనరసింహస్వామి పూజలు చేస్తున్న అర్చకుడు

ప్రొద్దుటూరు కల్చరల్: మండలంలోని నరసింహాపురం గ్రామంలో పురాతన లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో స్వామివారి జన్మనక్షత్రం స్వాతి సందర్భంగా గురువారం ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. వేకువజామున స్వామి, అమ్మవారి మూలవిరాట్‌కు విశేష అభిషేకాలు, అర్చనలు చేసి పట్టు వస్త్రాలు, వెండికవచాలు, రంగురంగుల పూలతో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని అమ్మవారిని దర్శించుకుని భక్తి శ్రద్ధలతో పూజించారు.

హుండీ ఆదాయం లెక్కింపు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న నిర్వాహకులు

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక బొల్లవరంలోని శ్రీ ప్రసన్నవేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం హుండీ ఆదాయాన్ని లెక్కించారు. 206 రోజులకు గాను రూ.4,73,700 భక్తులు స్వామివారికి హుండీలో కానుకల రూపంలో సమర్పించారు. కార్యక్రమంలో ఈఓలు రామచంద్రాచార్యులు, జగన్‌మోహన్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ గోనా ప్రభాకర్‌రెడ్డి, సభ్యులు రామకృష్ణారెడ్డి, రాజశేఖర్, మురళీకృష్ణ, చలపతి, శివరామిరెడ్డిభక్తులు పాల్గొన్నారు.

1న బండలాగుడు పోటీలు

ప్రొద్దుటూరు కల్చరల్: మండలంలోని కల్లూరు గ్రామంలో గుడ్ ఫ్రైడే, ఈస్టర్ పండుగలను పురస్కరించుకుని ఏప్రిల్ 1న సేద్యపు ఎద్దులతో బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు క్రైస్తవ యువజన సంఘం సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి బహుమతి రూ.30 వేలు, రెండో బహుమతి రూ.20 వేలు, మూడో బహుమతి రూ.10 వేలు, నాలుగో బహుమతి రూ.5 వేలు, ఐదో బహుమతి రూ.3 వేలు విజేతలకు అందిస్తామన్నారు.

వధూవరులకు ఆశీస్సులు



వలంటీర్ వివాహ వేడుకలో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి తదితరులు

బద్వేలు అర్బన్: మున్సిపాలిటీ పరిధిలోని అబ్బరాతివీధి సచివాలయం పరిధిలో పనిచేస్తున్న వలంటీర్ దూళ్ల సుకుమార్ వివాహానికి గురువారం ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో నియోజకవర్గ బూత్ కన్వీనర్ల సమన్వయకర్త కె.రమణారెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు సింగసాని శివయ్య, నాయకులు వెంకటసుబ్బయ్య, వెంకటరత్నంయాదవ్, సూర్యనారాయణరెడ్డి, యువజన విభాగం నాయకులు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

ప్రొద్దుటూరు: పట్టణంలోని యాచకులకు, నిస్సహాయకులకు, వృద్ధులకు గురువారం ప్రాణదాత సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. యనమల చెన్నారెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు డాక్టర్ యనమల చెన్నకేశవరెడ్డి, డాక్టర్ మల్లిక దంపతులు అన్నదానం చేసినట్లు ప్రాణదాత సేవా సమితి చైర్మన్ సునీల్ తెలిపారు. కార్యక్రమంలో నారాయణ, వేణు, రాజు, న్యాయవాది సుమంత్ కుమార్ పాల్గొన్నారు.

మైదుకూరులో ఇంటింటి ప్రచారం

మైదుకూరు: మైదుకూరు మున్సిపాలిటీలోని పోలింగ్ బూత్-86 పరిధిలో గురువారం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ జేసీఎస్ కన్వీనర్ వేమిరెడ్డి చంద్ర ఓబుళరెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలను వివరించారు. మైదుకూరు అభివృద్ధికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డిని మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కేపీ లింగన్న తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే ఇంటింటా ప్రచారం

వీరపునాయునిపల్లె : మండలంలోని గంగిరెడ్డిపల్లె, సంగాలపల్లె, మిట్టపల్లె, లింగాల గ్రామాల్లో శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్ రెడ్డి ఇంటింటా ప్రచారం నిర్వహించనున్నట్లు మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు పాల్గొనాలని కోరారు.

సీఎం జగన్ పాలనకు జననీరాజనం

- ప్రొద్దుటూరులో జరిగిన బహిరంగ సభే నిదర్శనం
- సిద్ధం సభకు లక్షలాది జనం
- ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి

ప్రొద్దుటూరు క్రైం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనను, ఆయన మాటలకు ప్రజలు నీరాజనాలు పలుకుతున్నారని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. బుధవారం ప్రొద్దుటూరులో జరిగిన బహిరంగ సభే నిదర్శనమన్నారు. వైఎంఆర్ కాలనీలోని పోరెడ్డి నరసింహారెడ్డి స్వగృహంలో ఎమ్మెల్యే రాచమల్లు గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రొద్దుటూరులో బుధవారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్న మేమంతా సిద్ధం బహిరంగ సభ విజయవంతమైందని తెలిపారు. జిల్లాలోనే ఎన్నడూ చూడని విధంగా లక్షలాది మంది సభకు వచ్చారని తెలిపారు. కడప పార్లమెంట్ పరిధిలోని 7 నియోజకవర్గాల నుంచి సుమారు 1.50 లక్షల మంది మేమంతా సిద్ధం సభకు వచ్చినట్లు నిఘా వర్గాలు అంచనా వేశాయని తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా 40–50 వేల మంది పాల్గొన్నారని పేర్కొన్నారు. సభ ఆలస్యంగా ప్రారంభమైనా జగన్‌ను చూడాలని ప్రజలు ఓపిగ్గా వేచి ఉన్నారని కొనియాడారు. సీఎం వైఎస్ జగన్ ర్యాంప్‌పై నడుస్తున్నప్పుడు లక్షలాది మంది జనం చూపిన ఉత్సాహం, వారి ఆనందాన్ని మాటల్లో వర్ణించలేమన్నారు. తన రాజకీయ జీవితంలో ఇంత పెద్ద సభను విజయవంతం చేయడం ఇదే మొదటిసారని ఎమ్మెల్యే చెప్పారు.

ప్రజలకు కృతజ్ఞతలు

ప్రొద్దుటూరు నియోజకవర్గంలో ఏ నాయకునికి దక్కని గౌరవం తనకు ఈ సభ ద్వారా దక్కిందన్నారు. అది వైఎస్ జగన్ వల్లే సాధ్యమైందని, సభను విజయవంతం చేసిన ప్రజలకు కృతజ్ఞతలు చెబుతున్నామన్నారు. ఎన్నికల నిబంధనలను అతిక్రమించకుండా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సిద్ధం సభను జరిపించారని ప్రశంసించారు. ముఖ్యంగా పార్టీ నాయకులు కల్లూరు నాగేంద్రారెడ్డి, పోరెడ్డి నరసింహారెడ్డి, నాగేశ్వరరెడ్డి, శౌరిరెడ్డి తదితరులు సభకు విజయవంతం చేసేందుకు ఎంతో కష్టపడ్డారని ఎమ్మెల్యే కొనియాడారు. లక్షల్లో ప్రజానీకం హాజరైన ఇంత పెద్ద మీటింగ్‌లో ఎక్కడా ఎలాంటి అసౌకర్యం, ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్న పోలీసులకు జిల్లా పోలీసు అధికారి సిద్దార్థ కౌశల్‌కు ధన్యవాదాలు తెలిపారు.

ఫ్యాన్ గుర్తుకు ఓటేయండి

తన వల్ల రాష్ట్రంలోని కుటుంబాలకు మేలు జరిగి ఉంటేనే ఓటెయ్యాలని ఎంతో నిజాయితీగా ప్రజలను సీఎం జగన్ కోరారన్నారు. ఈ 58 నెలల్లో వివిధ పథకాల రూపంలో ప్రజలకు లబ్ధి చేకూర్చేందుకు 130 సార్లు బటన్ నొక్కి పేదలు, మధ్య తరగతి వర్గాల జీవితాల్లో వెలుగులు నింపానని సీఎం చెప్పారన్నారు. ఇవన్నీ నిజం అయితే, తిరిగి ఇంతకంటే మెరుగ్గా సంక్షేమం జరగాలంటే రానున్న ఎన్నికల్లో రెండు సార్లు బటన్‌లు నొక్కాలని సీఎం జగన్ ప్రజలను కోరారన్నారు. మంచి చేసి ఉంటేనే ఓటేయాలని దేశ రాజకీయ చరిత్రలోనే ఏ నాయకుడు ఇంత నిజాయితీగా ప్రజలను అడగలేదని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజలకు మేలు జరిగి ఉంటే వైఎస్సార్‌సీపీకి ఓటెయ్యాలని రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి ప్రజలను అభ్యర్థించారు.

జీవామృతంతో అధిక దిగుబడి



ఘన జీవామృతం తయారీపై శిక్షణ ఇస్తున్న వ్యవసాయ విభాగం సిబ్బంది

మైదుకూరు: జీవామృతంతో పంటల సాగులో అధిక దిగుబడులను సాధించవచ్చని మైదుకూరు మండలం వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రం అధిపతి, శాస్త్రవేత్త డాక్టర్ ఎం. బాలకృష్ణ అన్నారు. గురువారం మండలంలోని ఆదిరెడ్డిపల్లెలో కేవీకే శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ విభాగం సిబ్బంది రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తూ జీవామృతం తయారీ, దాని వలన కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. ఘన జీవామృతం తయారీలో ఉపయోగించే ఆవు మూత్రం, పేడ, బెల్లం, పప్పుదినుసులు, పిండి గురించి క్షుణ్ణంగా వివరించారు. మండల ప్రకృతి వ్యవసాయ ఇన్‌చార్జి ఆదినారాయణ, మార్కెటింగ్, సర్టిఫికేషన్ అధికారి శ్రీనాథ్ రెడ్డి, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త ఫిరోజ్, ప్రకృతి వ్యవసాయ విధానాలు, ఆవశ్యకతను గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ రైతులు, అనంతరా

సీఎం జగన్‌ను కలిసిన రెడ్యం వెంకటసుబ్బారెడ్డి



సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో రెడ్యం సోదరులు

మైదుకూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ నాయకుడు, ఆర్టీసీ మాజీ జోనల్ చైర్మన్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డి గురువారం ఆళ్లగడ్డలో కలిశారు. తనకు పార్టీలో గుర్తింపు ఇస్తామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చెప్పారని రెడ్యం తెలిపారు. పార్టీ తిరిగి అధికారంలోకి వచ్చేందుకు కృషి చేయాలని చెప్పారన్నారు. రెడ్యం వెంట సీఎంను కలిసిన వారిలో ఆయన సోదరుడు కేసీ కాలువ నీటి సంఘం మాజీ అధ్యక్షుడు రెడ్యం చంద్రశేఖర్‌రెడ్డి ఉన్నారు.

బార్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక



నూతనంగా ఎన్నికైన బార్ అసోసియేషన్ కార్యవర్గం

ప్రొద్దుటూరు క్రైం: ప్రొద్దుటూరు బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీంగా ఎన్నుకున్నారు. బార్ అసోసియేషన్ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ప్రెసిడెంట్‌గా సి. సుదర్శన రెడ్డి, వైస్ ప్రెసిడెంట్‌గా ఎం. లక్ష్మీప్రసన్న, సెక్రటరిగా కె. గుర్రప్ప, ట్రెజరర్‌గా ఎం. చంద్రశేఖర్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీగా ఎం. రమేష్‌బాబు, మహిళా సెక్రటరిగా ఎం. షహనాజ్‌లను ఎన్నుకున్నారు. కొత్త కార్యవర్గం ఏడాది పాటు పని చేస్తుందని ప్రెసిడెంట్ సుదర్శనరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు దాదాపీర్, ఎం. సుధాకర్‌రెడ్డి, సి. జిలానిబాషా, ముడిమేల కొండారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

మైదుకూరు: మైదుకూరులోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో గురువారం బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడుగా జి.బాలవెంకటయ్య, ప్రధాన కార్యదర్శిగా కొట్టే జయరామ్, సంయుక్త కార్యదర్శిగా సోమేసుల యశ్వంత్ రాయల్, అసోసియేషన్ మహిళా విభాగం సంయుక్త కార్యదర్శిగా సోమేసుల సుచిత్రను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గానికి న్యాయవాదులు శుభాకాంక్షలు తెలిపారు.

ఓటు వజ్రాయుధం



మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటలక్ష్మి

ఖాజీపేట: ప్రజలకు రాజ్యాంగం కల్పించిన వజ్రాయుధం ఓటు హక్కు అని తహసీల్దార్ వెంకటలక్ష్మి వ్యాఖ్యానించారు. ఖాజీపేటలోని సాహిత్య డిగ్రీ కళాశాలలో ఓటుహక్కు వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ ఓటు హక్కును వంద శాతం వినియోగించుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకొని ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో ఆర్‌ఐ రవి, సాహిత్య డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ సంజీవ్‌రెడ్డి పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

ప్రొద్దుటూరు కల్చరల్: మండలంలోని అమృతానగర్‌లో గురువారం హెల్త్ ఎడ్యుకేషన్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో భారతీయ రిజర్వ్ బ్యాంక్ సౌజన్యంతో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రిజర్వ్ బ్యాంకు ఏపీ రీజనల్ అధికారి రాహుల్ సాహి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. అపరిచిత ఫోన్ కాల్స్, సందేశాలకు, ఓటీపీలకు స్పందించవద్దని సూచించారు. 14440 నంబర్‌కు కానీ, ఆర్‌బీఐ వెబ్‌సైట్‌లో నేరం జరిగిన 48 గంటల్లో ఫిర్యాదు చేయాలని తెలిపారు. డీసీసీ బ్యాంకు సీనియర్ మేనేజర్ చెన్నకేశవరెడ్డి తమ బ్యాంకు అందిస్తున్న సేవలను వివరించారు. రాటా సంస్థ కళాకారులు ప్రదర్శించిన జానపద గేయాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో డీసీసీ బ్యాంకు సీఈఓ రాజశేఖర్, హెడ్స్ అధ్యక్షుడు కృష్ణయ్య యాదవ్, కేఎస్ రూరల్ మీడియా అధ్యక్షుడు కె.శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం నేతలకు సత్కారం



ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు, కోశాధికారిని సత్కరిస్తున్న మైదుకూరు నాయకులు

మైదుకూరు: ఆర్యవైశ్య సంఘం కడప జిల్లా కమిటీలో మైదుకూరు ఆర్యవైశ్య నాయకులకు కీలక పదవులు లభించాయి. గురువారం మైదుకూరులోని అమ్మవారిశాలలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, కోశాధికారి మైదుకూరు నాయకులకు నియామక పత్రాలు అందజేశారు. మైదుకూరు ఆర్యవైశ్య సభ అధ్యక్షుడుగా ఉన్న సూరిశెట్టి శివవెంకటప్రసాద్ గుప్తా జిల్లా సంఘం ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. మైదుకూరు సంఘంలో ప్రధాన కార్యదర్శిగా ఉన్న దరిశ సునీల్ కుమార్ జిల్లా కమిటీ సంయుక్త కార్యదర్శిగా ఎన్నికయ్యారు. మైదుకూరు సంఘం కోశాధికారిగా ఉన్న ఎలిశెట్టి గురుప్రసాద్ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నియమితులయ్యారు. వీరికి గురువారం స్థానిక అమ్మవారిశాలలో ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు కాశం సుధాకర్ గుప్తా, కార్యదర్శి మేడ కామేశ్వరరావు, కోశాధికారి మురహరి సునీల్ కుమార్‌లు నియామక పత్రాలు అందజేశారు. తమను గుర్తించి జిల్లా కమిటీలో ముఖ్యమైన పదవుల్లో నియమించినందుకు మైదుకూరు నాయకులు జిల్లా కమిటీకి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, కోశాధికారిని మైదుకూరు ఆర్యవైశ్య సభ తరపున ఘనంగా సత్కరించి అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



నేచర్‌క్యాంప్‌కు హాజరైన విద్యార్థులు

బద్వేలు అర్బన్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఇన్‌ఛార్జి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ కె.వెంకటశేషయ్య పేర్కొన్నారు. జిల్లా అటవీ అధికారి పి.వి.సందీప్‌రెడ్డి ఆదేశాల మేరకు గురువారం పట్టణంలోని పలు పాఠశాలల విద్యార్థులతో పెనుశిల అభయారణ్యంలో నేచర్‌క్యాంప్ నిర్వహిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెట్లను నరకడం ద్వారా వాతావరణంలో అనేక మార్పులు సంభవిస్తున్నాయని తెలిపారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ అడువులను సంరక్షించాలని కోరారు. అలాగే వన్యప్రాణులను కూడా సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. ఈ క్యాంపులో విద్యార్థులకు సహజ అడవులు, ఎర్రచందనం వృక్షాలు, నర్సరీ, అటవీ ప్రాముఖ్యత వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ ఖాజావలి, ఎఫ్‌బీఓ సువర్ణకుమార్, పుష్పరాజ్, రెడ్డెమ్మ, విజయలక్ష్మి, శాంతి ప్రసన్న, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాల ఏర్పాటుకు ముందుకు రావాలి



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న వెంకటసుబ్బారెడ్డి

బద్వేలు అర్బన్: వేసవి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో పాదాచారులు, ప్రయాణికుల కోసం పట్టణ పరిధిలో విరివిగా చలివేంద్రాల ఏర్పాటుకు దాతలు, స్వచ్ఛంద సంఘాల ప్రతినిధులు ముందుకు రావాలని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జీ.వెంకటసుబ్బారెడ్డి, ఫ్రెండ్స్ సేవా సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లాయం యోగయ్య, గంగసాని సాంబశివారెడ్డి కోరారు.

స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఎదుట ఫ్రెండ్స్ సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మంచినీటి, మజ్జిగ చలివేంద్రాన్ని గురువారం వారు ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎండలు విపరీతంగా ఉన్న నేపథ్యంలో విద్యార్థులు, పాదాచారులు, ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో ఫ్రెండ్స్ సేవా సంఘం నాయకులు శ్రీనివాసులు, రాజశేఖర్, రవికుమార్, అయ్యప్ప, సుబ్బారెడ్డి, బాలయ్య, జయరామిరెడ్డి, సుబ్రమణ్యం, సత్తార్ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంచుకోవాలి



మాట్లాడుతున్న ప్రొఫెసర్ బి.జయరామిరెడ్డి

ప్రొద్దుటూరు: విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఆర్‌అండ్‌బీ శాఖ సూపరింటెండెంట్ పి.మహేశ్వరరెడ్డి సూచించారు. గురువారం స్థానిక వైఎస్సార్ ఇంజినీరింగ్ కాలేజిలో నిర్మాణిక -2024 సాంతికేక సమ్మేళనం నిర్వహించారు. వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు హాజరై తమ నైపుణ్యాన్ని ప్రదర్శించారు. సివిల్ ఇంజనీరింగ్ సాంకేతిక అంశాలపై పోస్టర్ ప్రజంటేషన్, మోడల్ మేకింగ్, టెక్నో హంట్, సాంకేతిక క్విజ్ పోటీల్లో విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ సివిల్ ఇంజనీరింగ్‌లో రోజురోజుకు సాంకేతిక అభివృద్ధి జరుగుతోందన్నారు. పశ్చిమ బెంగాల్‌లో భూగర్భ రైలు నిర్మాణాన్ని దిగ్విజయంగా పూర్తి చేయడం సివిల్ ఇంజనీరింగ్‌లో అద్భుతమైన ప్రగతికి నిదర్శనమన్నారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి.నాగరాజు మాట్లాడుతూ బ్యాక్టీరియాతో కాంక్రీట్‌లోని చీలికలను తగ్గించడానికి సాంకేతిక నైపుణ్యం, జియో పాలిమర్స్ ద్వారా అభివృద్ధి చెందిందన్నారు. సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి ప్రొఫెసర్ బి.జయరామిరెడ్డి మాట్లాడుతూ ఇలాంటి సెమినార్లలో వివిధ కళాశాలల విద్యార్థులు తమ నైపుణ్యాన్ని, ఆలోచన పరమైన విషయ పరిజ్ఞానాన్ని చర్చించడం జరుగుతుందన్నారు. దీని వల్ల విద్యార్థులు పరిశోధనల వైపు ఆలోచనాల సామర్థ్యాన్ని పెంపొందించుకుంటారని తెలిపారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డీన్ ప్రొఫెసర్ కేవీ రమణయ్య, మెకానికల్ విభాగాధిపతి ప్రొఫెసర్ జయచంద్రారెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ విద్యతో ఉజ్వల భవిష్యత్తు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ గురుమూర్తిరెడ్డి

మైదుకూరు: పాలిటెక్నిక్ విద్యతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అధికంగా ఉంటాయని తెలిపారు. మైదుకూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ పి.గురుమూర్తిరెడ్డి అన్నారు. గురువారం కళాశాలలో ఏర్పాటు చేసిన పాలిసెట్-2024 ఉచిత కోచింగ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ గురుమూర్తిరెడ్డి మాట్లాడుతూ పాలిటెక్నిక్ కళాశాలలో ఇస్తున్న పాలిసెట్ ఉచిత కోచింగ్‌ను అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తమ కళాశాలలో అనుభవజ్ఞులైన అధ్యాపకులతో పాలిసెట్‌కు ఉచిత కోచింగ్ ఇవ్వడమే కాకుండా మెటీరియల్ కూడా ఉచితంగా పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఈ కోచింగ్ ఏప్రిల్ 25 వరకు కొనసాగుతుందని, సెలవు రోజుల్లో కూడా క్లాసులు నిర్వహిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని మైదుకూరు చుట్టుపక్కల ప్రాంతాల వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు థామస్, శాలిని, సుభాష్ చంద్ర, పవన్ కుమార్ పాల్గొన్నారు.

నేటితరం నాయకులకు వెంకటసుబ్బయ్య ఆదర్శం



వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బద్వేలు అర్బన్: వైద్యుడిగా, శాసనసభ్యుడిగా నిరాడంబర జీవితాన్ని గడిపిన దివంగత ఎమ్మెల్యే డాక్టర్ జీ.వెంకటసుబ్బయ్య నేటితరం నాయకులకు ఆదర్శమని సివిల్‌సప్లయ్ కార్పొరేషన్ డైరెక్టర్ సుందర్‌రామిరెడ్డి, గిద్దలూరు అసెంబ్లీ ఎన్నికల పరిశీలకులు బంగారు శీనయ్య కొనియాడారు. దివంగత నేత డాక్టర్ జీ.వెంకటసుబ్బయ్య తృతీయ వర్ధంతి సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు డాక్టర్ శ్రీను, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబర్ సి.నారాయణ ఆధ్వర్యంలో గురువారం స్థానిక తెలుగుగంగ కాలనీలోని నిరాశ్రయుల వసతిగృహంలో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేసి అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ సాధారణ మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన డాక్టర్ వెంకటసుబ్బయ్య వైద్యుడిగా, శాసనసభ్యుడిగా ఎదిగారని తెలిపారు. ఆయన ఆశయసాధనకు కలిసికట్టుగా కృషి చేస్తామని పేర్కొన్నారు. తొలుత వెంకటసుబ్బయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి యద్దారెడ్డి, ఆయా వార్డుల ఇన్‌చార్జిలు చెన్నకృష్ణారెడ్డి, నాగేశ్వర్‌రావు, చెంచయ్య, నరసింహ, ఆశ్రమ నిర్వాహకులు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలనకు ప్రజాశీస్సులు



చిన్నపసుపుల గ్రామంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే ఎం.సుధీర్‌రెడ్డి

పెద్దముడియం : జగన్ సంక్షేమ పాలనకు ప్రజాశీస్సులు మెండుగా ఉన్నాయని జమ్మలమడుగు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని చిన్నపసుపుల, మేడిదిన్నె గ్రామంలో ఆయన గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలు, జరిగిన అభివృద్ధిని వివరించి ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ముఖ్యమంత్రి జగన్ అహర్నిశలు శ్రమించారన్నారు. అనుక్షణం పేదల సంక్షేమం కోసం పరితపిస్తున్న ఏకైక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని తెలిపారు. వెనుకబడిన వర్గాలను చంద్రబాబు ఓటు బ్యాంక్‌గా వాడుకుని వదిలేశారన్నారు. పేదల సంక్షేమం కోసం పాటుపడుతున్న వైఎస్సార్‌సీపీని మరోసారి ఆశీర్వదించాలని తెలిపారు. మే 13న జరిగే ఎన్నికల్లో మరోసారి ఫ్యాను గుర్తుకు ఓట్లు వేసి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, ఎంపీ అభ్యర్థిగా వైఎస్ అవినాష్‌రెడ్డిని అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

రైల్వే ట్రాక్ కోసం వేగంగా సర్వే

పులివెందుల రూరల్ : ముద్దనూరు నుంచి పులివెందుల సత్యసాయి జిల్లా, ముదిగుబ్బ, పుట్టపర్తి, ప్రశాంతినిలయం రైల్వేస్టేషన్ వరకు కొత్త రైల్వే ట్రాక్ కోసం సర్వే పనులు వేగంగా జరుగుతున్నాయి. 110 కిలోమీటర్ల రైల్వే ట్రాక్ కోసం నాలుగు సర్వే బృందాలు యంత్రాల సాయంతో 30 అడుగుల లోతులో మట్టి నమూనాలను సేకరిస్తున్నారు. పులివెందుల మండలంలోని నల్లపురెడ్డిపల్లె పొలాల్లో, లింగాల మండలంలోని ఇప్పట్ల పొలాల్లో సర్వే పనులు జరుగుతున్నాయి. ముద్దనూరు నుంచి పులివెందుల మీదుగా వెళ్తున్న రైల్వే మార్గం ముదిగుబ్బ, పెనుగొండ రైల్వేస్టేషన్‌ను కలుపుతూ ప్రశాంతినిలయం రైల్వేస్టేషన్ వద్ద కలుస్తుంది. రైల్వేమార్గం పనులు పూర్తి అయితే జిల్లా వాసులే కాక పులివెందుల–ముదిగుబ్బ–హిందూపురం మీదుగా బెంగుళూరు వరకు తక్కువ సమయంలో చేరుకోవచ్చు. రైల్వేమార్గం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమాన వాటాలో నిధులు భరించనున్నాయి. రైల్వే మార్గం కోసం ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి కేంద్ర రైల్వేశాఖ మంత్రి, కేంద్ర మంత్రులతో అనేకమార్లు చర్చించి రైలు మార్గాన్ని సుగమం చేసినందుకు కడప జిల్లా, పులివెందుల, ముద్దనూరు ప్రాంతాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

శవ రాజకీయాలు చేస్తున్న టీడీపీ

ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి



భాను కుమారుడిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

మైదుకూరు: టీడీపీ నాయకులు శవ రాజకీయాలు చేస్తున్నారని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక సాయినాథపురంలోని 12వ వార్డులో గుండెపోటుతో మృతి చెందిన భాను కుటుంబాన్ని గురువారం ఎమ్మెల్యే పరామర్శించారు. భాను మృతికి సంబంధించిన కారణాలను ఆమె తండ్రి కరీంను అడిగి తెలుసుకున్నారు. మృతురాలి కుటుంబసభ్యులను ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రఘురామిరెడ్డి మాట్లాడుతూ ఎవరైనా దురదృష్టవశాత్తు మృతి చెందితే పరామర్శించవచ్చు కానీ, ఆ మృతిని రాజకీయాలకు ఉపయోగించుకోవాలనుకోవడం శోచనీయమని అన్నారు. రెండు మూడేళ్లుగా అనారోగ్యంతో ఉన్న భాను బుధవారం గుండెపోటుతో మృతి చెందడం బాధాకరమన్నారు. ఆమె మృతిని తెలుగుదేశం పార్టీ నాయకులు నీటి సమస్యతో ముడిపెట్టి రాజకీయంగా ఉపయోగించుకోవాలనుకోవడం హేయమని అన్నారు.

తాగు నీటి సమస్య రానివ్వం

ఈ ఏడాది వర్షాలు లేక నీటి సమస్య ఉత్పన్నమైందని తెలిపారు. అయితే ప్రజలు ఇబ్బంది పడకుండా ట్యాంకర్లతో అందిస్తున్నామని పేర్కొన్నారు. గతంలో ఖాజీపేట మండలం ములపాక వద్ద ఉన్న బృహత్తర నీటి పథకాన్ని తిరిగి ప్రారంభించేందుకు బుధవారం పెన్నాలో నాలుగు ఫిల్టర్లను కూడా వేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అక్కడి నుంచి మైదుకూరు పట్టణానికి నీరు అందించే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. అంతేకాక తెలుగుగంగ రిజర్వాయర్ నుంచి మైదుకూరు ఎర్ర చెరువుకు నీటిని సరఫరా చేస్తున్నామని పేర్కొన్నారు. అవసరమైతే ఏప్రిల్, మే నెలలో కూడా చెరువుకు నీటిని అందిస్తామని ప్రకటించారు. ఎక్కడ నీటి సమస్య ఉన్నా బోర్లు వేసి మోటార్లు బిగిస్తామని, అయితే ఎన్నికల కోడ్ ఉండటం వల్ల ఇబ్బందిగా ఉందన్నారు. కొత్తగా బోరు వేయాలంటే కలెక్టర్ అనుమతి కావాలని గుర్తుచేశారు. నీటి సమస్య రాకుండా చూస్తున్నామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఆయన వెంట పట్టణ అధ్యక్షుడు కేపీ లింగన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి కిరణ్మయి, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు ట్రాక్టర్ గౌస్, షౌకత్, ఖాదర్ తదితరులు ఉన్నారు.

నేడు దువ్వూరు మండలంలో ప్రచారం

దువ్వూరు: దువ్వూరు మండలంలోని నీలాపురం, దానరిపల్లి, సుగాలితాండలో శుక్రవారం ఉదయం 6 గంటలకు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మైదుకూరు నియోజకవర్గ సమన్వయకర్త శెట్టిపల్లె నాగిరెడ్డి ఎన్నికల ప్రచారం చేస్తారని ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి తెలిపారు. మండల ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.